క్లుప్తంగా

వాసవి క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



బొల్లాపల్లి: వాసవి క్లబ్ సమావేశం వెల్లటూరు గ్రామంలోని వాసవి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పేరం వేణు, ప్రధాన కార్యదర్శిగా గజవల్లి సుబ్బయ్య, గౌరవాధ్యక్షుడిగా ఖజ్జాయం లక్ష్మీనారాయణను, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. సమావేశంలో వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



శావల్యాపురం: కనమర్లపూడి, మతుకుమల్లి గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవన సముదాయాలను మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య సోమవారం తెలిపారు. శావల్యాపురం రైతు భరోసా కేంద్రం, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయిన్స్ పనుల ప్రారంభోత్సవం కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. సర్పంచ్ తన్నీరు భారతి, యలగాల బసవయ్య, పంచాయతీ ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఈవీఎంపై అవగాహన సదస్సు



శావల్యాపురం: వేల్పూరు, గంటావారిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంపై ప్రజలకు, రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య సోమవారం తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు అన్నీ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీఆర్వోలు వీరవల్లి నాగ సంతోష లక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

వాగు, పోరంబోకు భూముల ఆక్రమణపై ఫిర్యాదు

బొల్లాపల్లి: రెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మొండికట్ట వద్ద వాగు, ప్రభుత్వ పోరంబోకు భూమి అన్యాక్రాంతమైందని సర్పంచ్ కె.ప్రభాకర్ తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. మొండికట్ట వద్ద వాగు, ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నెం. 529/2, 530/1, 530/2లో గల భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఈ భూములను ఆనుకొని ఉన్న వాగును పూడ్చివేసి చదును చేశారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని అర్జీలో విన్నవించారు. తహసీల్దారు ఎన్.దుర్గేశ్వరరావు స్పందిస్తూ.. సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు వెల్లడించారు.

సచివాలయ స్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు

ఈపూరు: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ముగిసినట్లు స్కూల్ చైర్మన్ గన్నవరం రమేష్, హెచ్ఎం వీరప్పయ్య సోమవారం తెలిపారు. డిసెంబరు 26 నుంచి సచివాలయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. క్రీడాకారులు మండల స్థాయిలో రాణించి, రాష్ట్ర స్థాయి వరకు వెళ్లాలని సూచించారు. క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి, క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. మందపాటి అంజయ్య, రామారావు, కోటేశ్వరరావు, సందేశం వెంకటసత్యనారాయణ, మండాది అంజయ్య తదితరులున్నారు.

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బెల్లంకొండ: నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై సోమవారం సాయంత్రం ఎస్ఐ కె.అమీర్ ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు చేశా రు. మండలంలోని పులిచింతల ముంపు గ్రామమైన కేతవరంలో పాత పాడు బడ్డ ఇళ్లలో నాటుసారా కాస్తున్నారన్న సమాచారంలో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నాటు సారా తయారు చేస్తున్న న్యూ చిట్యాల గ్రామానికి చెందిన ఆదావతు చిన్న బాలు నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అతని వద్ద ఉన్న 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, సుమారుగా 100 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తు న్న సామగ్రిని స్వా. ధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ వెంట కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్రావు, హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సంక్రాంతి శోభ

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగ వల్లులు, అందులో చేర్చిన గొబ్బెమ్మలు, చిన్నారుల హరిదాసు వేషధారణ, భోగి మంటల చుట్టూ ఆట పాటలు, పతంగుల విహంగాలు, ఉపాధ్యాయుల భోగిపండ్ల ఆశీర్వాదాలతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంక్రాంతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, సంతోషంగా పండగను జరుపుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

- ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు
- రంగవల్లుల్లో మునిగిపోయిన విద్యార్థినులు
- హరిదాసు వేషధారణలో అలరించిన చిన్నారులు
- భోగి పండ్లు పోసి ఆశీర్వదించిన ఉపాధ్యాయులు



రొంపిచర్ల: భోగిమంట చుట్టూ విద్యార్థుల కోలాటం

రొంపిచర్ల: బుచ్చి బాపన్నపాలెం జెడ్పీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారి హరిదాసు వేషధారణ, ముగ్గులు, భోగి మంటలు, పులగ అన్నం, భోగి పండ్ల ఆశీర్వాదంతో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు సంక్రాంతి పండగను ఉపాధ్యాయులు వివరించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, వెంకటరెడ్డి, సెల్వరాజ్ పాల్గొన్నారు.

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హెచ్ఎం ఐ.కృష్ణానాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, గాలి పటాల పోటీలు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఎ.పద్మావతి, ఉషారాణి, డి.నాగేశ్వరాచారి, ఎం.స్నేహలతరెడ్డి, రత్నరాజు, సురేష్‌నాయక్, డీబీ నాయక్, కోటేశ్వరరావు పీడీ వేణుగోపాల్, పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి పాల్గొన్నారు.

యడ్లపాడు: లింగారావుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బాలబాలికలకు భోగి పండ్ల స్నానం చేయించారు. రంగవల్లులు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం కేవీ రామిరెడ్డి, సర్పంచ్ షేక్ కరీమూన్, పీఎం చైర్మన్ షేక్ మీరావలి, ఉపాధ్యాయులు డి.రామాంజనేయులు, శ్రీనివాసరావు, విజయ శామ్యూల్, సుధాకర్, కె.రమాదేవి, టి.శైలజ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బొల్లాపల్లి: మోడల్ స్కూల్లో సంక్రాంతి ముగ్గు

బొల్లాపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ వి.పద్మావతి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.



వినుకొండ: ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గీతమ్స్ గ్లోబల్ మైండ్స్ స్కూల్లో తెలుగు దనం ఉట్టిపడేలా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణ చేశారు. బొమ్మల కొలువులు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

శావల్యాపురం: కారుమంచి గ్రామం ఎంపీపీ స్కూల్లో మందుస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాకోబ్, ఉపాధ్యాయులు గోరంట్ల విజయకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



నాదెండ్ల: విద్యార్థులకు బహుమతుల ప్రదానం



యడ్లపాడు : భోగిపండ్ల ఆశీర్వాదం అందిస్తున్న ఉపాధ్యాయులు



బొల్లాపల్లి: భోగి మంటలు



రొంపిచర్ల: చిన్నారి హరిదాసుకు..

గర్వంగా చెప్పకునేలా సీఎం జగన్ పాలన

ఆర్బీకే, విలేజ్ క్లినిక్ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పింఛను నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: నవరత్న పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి నగదు జమ చేస్తున్నామని గర్వంగా చెప్పుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని చిట్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు చెప్పారు. ప్రతి సంక్షేమ పథకాన్ని గడప ముందుకు తీసుకొచ్చింది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ఎలాంటి సమస్య అయినా.. గ్రామాల్లోనే పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన అవసరం ఉండేదని గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎక్కడ పేదలంతా ధనికులవుతారనే కుట్రతో.. పెత్తందారులందరూ ప్రస్తుతం ఒక్కటవుతున్నారని విమర్శించారు. ప్రజలు వీటన్నింటిని గమనించి అభివృద్ధికి, సంక్షేమానికి మద్దతు తెలపాలని కోరారు. బిల్డింగ్ నిర్మాణాలను చేపట్టిన వారిని ఎమ్మెల్యే బొల్లా సన్మానించారు. అనంతరం పెంచిన వైఎస్సార్ పింఛను కానుకను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. జగనన్న భూ రక్ష సమగ్ర భూ సర్వేలో భాగంగా రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు నాడు-నేడు పథకం ద్వారా నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దేవరాజ్, బుచ్చయ్య, హనుమయ్య, గోలి వెంకటేశ్వర్లు, రామారావు, వెంకట్రావు, కోంద్రు పతి, శ్రీనివాస రెడ్డి, బొర్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు సత్వరం పరిష్కరిస్తున్నాం

మండలంలో విద్యుత్ సమస్యలపై అడ్వైజరీ కమిటీ సమావేశం



విద్యుత్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చైర్మన్లు, కమిటీ సభ్యులు, అధికారులు

క్రోసూరు: మండలంలో రైతులకు, ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలున్నా విద్యుత్ అధికారులు, సిబ్బంది సత్వరమే పరిష్కరిస్తున్నారని విద్యుత్ సబ్‌స్టేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్లు ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యులు షేక్ జమీలా గఫూర్ తెలిపారు. సోమవారం క్రోసూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసి అడ్వైజరీ కమిటీ సమావేశంలో చైర్మన్లు పాల్గొని, మాట్లాడుతూ మండలంలో రైతులకు పూర్తిస్థాయిలో 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోందని, అదేవిధంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచుకుని ఎప్పుడు అవసరమైనా సత్వరం మార్చించటం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో విద్యుత్ కనెక్షన్లు, స్తంభాలు, విద్యుత్ సరఫరా పూర్తి చేసినట్లు చెప్పారు. రాత్రిళ్లు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా విద్యుత్ సిబ్బంది స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. రైతులు తమ సమస్యలేమైనా ఉంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రైతులకు విద్యుత్ సమస్యలు రాకుండా అధికారులు, సిబ్బందికి నిరంతరం సూచనలు, సలహాలు అందజేస్తున్నారని వారు తెలిపారు. మండల విద్యుత్ ఏఈ బసవరాజు, వ్యవసాయాధికారి వేణుగోపాల్, రైతులు, గాదెవారిపాలెం సర్పంచ్ దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ముగ్గురు రాజుల మహోత్సవం



దివ్య పూజాబలి నిర్వహిస్తున్న గురువులు

పెదకూరపాడు: క్రైస్తవ విశ్వాసులు వైభవంగా జూబిలి ముగ్గురు రాజుల మహోత్సవం పెదకూరపాడులో ఆదివారం జరుపుకున్నారు.ఈ సందర్భంగా పండగ సమిష్ట పూజను చిలకలూరిపేట విచారణ గురువు పెట్ల మరియదాసు, నంబూరు విచారణ గురువు పూదోట చిన్నయ్యలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి డాక్టర్ గాలి బాలి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్షమ, దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండటమే క్రైస్తవ విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. దివ్య నక్షత్రం చూపిన మార్గంలో నడిచిన ముగ్గురు రాజులు బాల ఏసును దర్శించుకొని మహిమత్వాన్ని పొందారన్నారు. దీనిని పురస్కరించుకుని ప్రతి ఏడాది ముగ్గురు రాజుల మహోత్సవం జరుపుకొంటారని తెలిపారు. క్రైస్తవ విశ్వాసులు ఒత్తులను సమర్పించారు. రాత్రి బాల ఏసుతో కూడిన మేరీ మాత విగ్రహాన్ని గ్రామ పురవీధులలో కనక తప్పెట్లు, బ్యాండు మేళాలతో ఊరేగించారు. తేరు ప్రారంభంలో పేల్చిన భారీ బాణసంచా చూసేందుకు భక్తులు తరలివచ్చారు. స్థానిక విచారణ గురువులు పుట్టి సుందరరాజు, సంతోష్ పండగ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలువురు భక్తులు మోకాళ్లపై నడిచి, తమ మొక్కులను తీర్చుకున్నారు. సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వలంటీరు కుటుంబానికి ఆర్థిక సాయం



వలంటీర్ తల్లి అనంతలక్ష్మికి నగదు అందిస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

యడ్లపాడు: వలంటీరు కుటుంబానికి చిలకలూరిపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అండగా నిలిచారు. యడ్లపాడు గ్రామ సచివాలయ వలంటీర్ కందుకూరి శరత్‌కుమార్(25) గతేడాది డిసెంబరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని కుటుంబం ఆర్థిక కష్టాల్లో ఉందని తెలుసుకున్న రాజేష్ నాయుడు సోమవారం మృతుడు శరత్‌కుమార్ తల్లి అనంతలక్ష్మికి వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్, జెడ్పీటీసీ ముక్తా వాసు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఘంటా శంకర్, నాయకులు ఉన్నారు.

కార్యకర్త మృతికి నివాళి

సందెపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తుర్లపాడు బాలస్వామి(38) గుండెపోటుతో మృతి చెందాడు. సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు సోమవారం అతని మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జేసీఎస్ మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, నాయకులు ఉన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులతో ఎంఈవో కె.లక్ష్మి

చిలకలూరిపేట: అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఎంఈఓ కె.లక్ష్మి స్పష్టం చేశారు. పట్టణంలోని ఎంసీఆర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వార్షిక తనిఖీ సోమవారం చేపట్టారు. పాఠశాల రిజిష్టర్లు, రికార్డులను ఆమె పరిశీలించారు. స్మార్ట్ టీవీలు ఉపయోగించి, డిజిటల్ విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత నెలలో జరిగిన ఎస్ఏ-1 పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించారు. పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల కోసం ప్రత్యేక రిజిస్టర్ నమోదు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులందరూ.. పాఠశాలలోనే భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భోజనం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ హెచ్ఎం కె.సుధా, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎ.నీలిమ, టి.కుమారి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ప్రతినిధి సీఎం జగన్



గణపవరంలో పింఛన్లు అందిస్తున్న వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు

నాదెండ్ల: సంపన్న వర్గానికి ప్రతినిధి చంద్రబాబు అయితే.. పేద, బడుగు బలహీన వర్గాల ప్రతినిధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గణపవరం 1వ సచివాలయంలో సోమవారం వైఎస్సార్ పెన్షన్ కానుకను పంపిణీ చేశారు. మండల పరిధిలో 9,800 మంది పింఛనుదారులుండగా గణపవరంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 2,350 మంది ఉన్నారని, వీరిలో కొత్తగా 29 మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆర్వపల్లి శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు ఇలాగే అమలు కావాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, సచివాలయ కార్యదర్శులు కవిత, జ్యోతిర్మయి, వెల్ఫేర్ అసిస్టెంట్లు దయానిధి, ఖాజాఖీజర్ పాల్గొన్నారు.

పిండమార్పిడి ప్రక్రియతో ఒంగోలు జాతి కోడెదూడ

క్రోసూరు: ఒంగోలు జాతికి చెందిన మేలురకం కోడెదూడను పుట్టించటంలో లాం ఫామ్ శాస్త్రవేత్తలు, పశువైద్యులు మరోసారి విజయం సాధించినట్లు సోమవారం మండల పశువైద్యుడు డాక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన వివరాలు తెలుపుతూ స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి ప్రక్రియ ద్వారా ఈ కోడెదూడను పుట్టించటం జరిగిందని తెలిపారు. ఏపీ పశుసంవర్ధక శాఖ లాంఫాం, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా కోడె దూడ పుట్టినట్లు చెప్పారు. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామంలోని రైతు పి.వెంకట్రావుకు చెందిన నాటు ఆవు గర్భంలో మేలుజాతి ఒంగోలు జాతి పిండాన్ని గతేడాది మార్చి 3న ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 7న ఆరోగ్యవంతమైన ఒంగోలు జాతి కోడెదూడకు ఆవు జన్మనిచ్చిందన్నారు. లాం ఫాం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకత్వంలో పిండమార్పిడి చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో అండాలను సేకరించేందుకు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ, ఐవీఎఫ్, ఫలదీకరణ పిండాన్ని అభివృద్ధి చేయటంతో లాంఫాంకు చెందిన డాక్టర్ ఎస్ఆర్ శ్రీకాంత్ సేవలందించినట్లు వివరించారు. ఆవును ఎంపిక చేసి పిండాన్ని ఆవు గర్భంలో ప్రవేశపెట్టడానికి మండల పశువైద్యాధికారి క్రోసూరు, దొడ్లేరు పశువైద్యులు డాక్టర్ మల్లయ్య సేవలందించారన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



నరసరావుపేట ఈస్ట్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు జొన్నలగడ్డ గ్రామానికి చెందిన నల్లపాటి రామారావు, అచ్చియ్య కుటుంబ సభ్యులు సోమవారం స్టడీ మెటీరియల్ అందచేశారు. విద్యార్థినులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని కుమారి, రాష్ట్ర గిరిజన సంఘం నాయకుడు బి.కోటానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పట్టణ కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట: ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నరసరావుపేట పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ సైదా, పట్టణ అధ్యక్షుడిగా బి.అబ్రహాం, ఉపాధ్యక్షుడిగా జి.ఆదినారాయణ, కార్యదర్శిగా చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా భూషణం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.ఏసు, పబ్లిసిటీ కార్యదర్శిగా ఎస్ఎంఏ.ఘోరి, కోశాధికారిగా వై.వీరారెడ్డితో పాటు మరో ఇద్దరు సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు కనపర్రులో ఉచిత వైద్య శిబిరం

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో మంగళవారం ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. నరసరావుపేటకు చెందిన కేర్ వైద్యశాల సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించనున్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటో తీసుకురావాలని నిర్వాహకులు సోమవారం తెలిపారు.

వంద మంది బైండోవర్

యడ్లపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా యడ్లపాడు, కారుచోల, గుత్తావారిపాలెం, మైదవోలు గ్రామాల పరిధిలో ఇప్పటి వరకు వంద మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

తూబాడులో మెడికల్ క్యాంపు

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న స్టీఫెన్ (6) అనే చిన్నారి శనివారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. నిమోనియాతో బాధపడుతున్న నూతక్కి అలెక్స్ (5) ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో రవికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ హనుమకుమార్, డీఎంవో రవీంద్ర రత్నాకర్, నాదెండ్ల మెడికల్ ఆఫీసర్ సాయిశ్వేత గ్రామాన్ని సందర్శించి, చిన్నారుల మృతి వివరాలు నమోదు చేసుకున్నారు. అదే కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. డెంగీ, మలేరియా అనుమానంతో కొందరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి నెగిటివ్ వచ్చింది. మరో నాలుగు రోజుల పాటూ మెడికల్ క్యాంపు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. గ్రామంలో డెంగీతో చిన్నారులు చనిపోయారన్న విషయంలో నిజం లేదని అధికారులు తేల్చారు.

జై ఆంధ్ర జై భారత్ లీగల్ అడ్వైజర్‌గా సాయిదుర్గా



సత్తెనపల్లి: జై ఆంధ్ర జై భారత్ సమాచార హక్కు సంఘం పల్నాడు జిల్లా మహిళా లీగల్ అడ్వైజర్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది సాయిదుర్గను నియమించారు. పట్టణంలోని ఐఎంఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాతీయస్థాయి సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రానందన్ చేతుల మీదుగా ఆమె నియమక పత్రం అందుకున్నారు. నూతనంగా నియమితులైన సాయి దుర్గని కమిటీ సభ్యులు అభినందించారు. జాతీయ ప్రచార కార్యదర్శి బి.నాగసాయి ప్రసాద్, జాతీయ కమిటీ సభ్యుడు కె.వి.సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.